క్లుప్తంగా

28న హార్సిలీహిల్స్ సొసైటీ సభ

బి.కొత్తకోట: హార్సిలీహిల్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ మహాజన సభను ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు చైర్మన్ జి.సోమశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు నిర్వహించే సభకు సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఇద్దరిపై కేసు నమోదు

కేవీపల్లె : ఘర్షణకు పాల్పడి పరస్పరం దాడి చేసుకున్న ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. వివరాలిలా వున్నాయి. మండలంలోని ఇర్రివాండ్లపల్లెకు చెందిన నాగరాజ, జగన్‌మోహన్ గ్రామంలో దిబ్బ విషయమై గొడవపడ్డారు. పరస్పరం దాడి చేసుకుని గాయపడ్డారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి ఆటల పోటీలు

పెద్దతిప్పసముద్రం: స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో భాగంగా మండల కేంద్రంలో ఈ నెల 15, 16 తేదీల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ-టూ గౌస్‌పీర్, మండల కోఆర్డినేటర్ జవహర్, హెచ్ఎం వేమనారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరికీ అండర్-14, 17 కేటగిరీలో కబడ్డీ, కోకో, వాలీబాల్, షటిల్, బాట్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు.

17 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

తంబళ్లపల్లె: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో17, 18 తేదీల్లో విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, పీడీ ఖాదర్‌బాషా తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాల,బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు, సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు తమతమ జట్ల అర్హత పత్రాలతో పోటీలకు పంపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మునిగోటి శ్రీనివాసశర్మ

మదనపల్లె సిటీ: ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల అందిస్తోంది. గుంటూరులోని బ్రాడీపేట బ్రాహ్మణ సేవా సమితి భవనంలో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో మదనపల్లెకు చెందిన రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు మునిగోటి శ్రీనివాసశర్మ దేవదాయశాఖ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీత ఉపాధ్యాయుడిగా, అఖిల బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడిగా, చిప్పిలి అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయ వ్యవస్థాపక సభ్యునిగా పని చేశారు. ఆయన సేవలు గుర్తిస్తూ అవార్డుకు ఎంపిక చేశారు. అయన్ను పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు జీవీ ప్రసాద్, రాధామణి తదితరులు అభినందనలు తెలియజేశారు.

గాయపడిన వ్యక్తి మృతి



అన్నయ్య (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రంకు చెందిన నవరాల అన్నయ్య (55) మూడు రోజుల క్రితం బి.కొత్తకోట రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడు మదనపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందేవాడు. ఈ తరుణంలో పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు మురళీ ఫిర్యాదు మేరకు బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

ఏనుగుమల్లమ్మకు ప్రత్యేక ఆలంకరణ



ప్రత్యేకాలంకరణలో ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ ప్రత్యేక ఆలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం అమ్మవారికి వెండి కవచం, కిరీటం, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలను నిర్వహించారు. కొండపైకి వచ్చిన సందర్శకులు ఏనుగుమల్లమ్మను దర్శించుకున్నారు.

ఆంధ్రా ఊటీ..ఆహ్లాదం లూటీ



లవ్ గుర్తును ధ్వంసం చేసి, అక్షరాలను పగులకొట్టిన మందుబాబులు



కొండకింద మూతపడిన చెక్‌పోస్టు

- హార్సిలీహిల్స్‌పై మందుబాబుల స్వైరవిహారం
- కొండకింద చెక్‌పోస్టు ఎత్తివేతతో సమస్యలు
- రాత్రివేళల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం
- మళ్లీ చెక్‌పోస్టు ప్రారంభించాలని సందర్శకుల వినతి

బి.కొత్తకోట: పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై మళ్లీ మందుబాబులు స్వైరవిహారం చేస్తున్నారు. వీరి ఆగడాలపై సాక్షాత్తు జిల్లా కలెక్టర్ కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో చెప్పాల్సిన పనిలేదు. కొండకింద ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టును సిబ్బంది కొరత కారణంగా ఎత్తివేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఈమధ్య హార్సిలీహిల్స్‌కు వచ్చే సందర్శకుల సంఖ్య పెరిగింది. కుటుంబాలతో వచ్చే సందర్శకుల అధికమైంది. దీనితో వీరు కొండపై ఏలాంటి ఇబ్బందులు లేకుండా కొండపై సంచరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించాలి. వివిధ సందర్శనా ప్రాంతాల్లో నిత్యం రద్దీ కూడా ఉంటుంది. ప్రశాంతమైన వాతావరణం ఇటీవల దెబ్బతింటోంది.

గాలిబండ అడ్డా

కొండపై గాలిబండ సందర్శకులు అమితంగా ఇష్టపడే ప్రాంతం. ఇక్కడినుంచి సుందరమైన ప్రకృతి అందాలతోపాటు సమీపంలోని కర్ణాటక ప్రాంతాన్ని తిలకించవచ్చు. రాత్రివేళ ఇక్కడినుంచి చూస్తే నింగి నేల కలిసిపోయినట్టుగా కనిపిస్తుంది. కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రాల సరిహద్దులు తెలియకుండా విద్యుత్ దీపాలతో కనువిందు చేస్తుంది. ఈచోటు మందుబాబులకు అడ్డగా మారిపోయింది. పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం సేవించడం, ఖాళీసీసాలను బండపైకేసి పగులగొట్టడం వారిపని. రాత్రివేళల్లో అయితే వీరి ఆగడాలకు అంతులేదు. ఈమధ్య కాలంలో ఓ ఎస్పీ కొండపై కాలినడక ప్రకృతి అందాలను తిలకిస్తుండగా మందుబాబులను అక్కడి నుంచి పంపే క్రమంలో పోలీసు సిబ్బందిపైనే తిరగబడ్డారు. ఓ కలెక్టర్ వస్తున్నారని తెలిసి ముందుగా గాలిబండపైకి వెళ్లి మందుబాబులను అక్కడినుంచి పంపాల్సి వచ్చింది. గతంలో ఓ ఎస్పీకి మందుబాబులతో చేదు అనుభవం కలిగింది. తాజాగా ఇటీవల గత కలెక్టర్ శ్రీధర్ చామకూరి గాలిబండపై ఐ లవ్ హార్సిలీహిల్స్ అనే ఆంగ్ల అక్షరాలు, వాటికి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి సుందరంగా ఏర్పాటు చేయగా దాన్ని ప్రారంభించడానికి వచ్చిన రోజు రాత్రే మద్యం మత్తులో అక్షరాలను ధ్వంసం చేయడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ అక్షరాల్లో ప్రేమ చిహ్నంను ధ్వంసం చేశారు. గతంలో గట్టినిర్మాణంతో ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఇంతటితో సరిపెట్టని మందుబాబులు గాలిబండ వద్ద పోలీసు సమాచార కేంద్రాన్ని వదలకుండా ధ్వంసం చేశారు.

అనుమానాస్పద సంచారం

కొండపైకి వస్తున్న వారిలో ఎవరు, ఎక్కడినుంచి వస్తున్నారో పూర్తి సమాచారం లేకుండాపోతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా అనుమానాస్పద వ్యక్తుల సంచారం అధికమైంది. హార్సిలీహిల్స్‌పైకి వచ్చే ప్రతిఒక్కరూ పర్యాటక ప్రాంతం కాబట్టి సందర్శనకు వస్తున్నట్లు చెబుతుంటారు. వాస్తవంగా ఎవరు ఎలాంటి వారో తెలియని ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో కొండపై ఓ మహిళను దారుణంగా హత్య చేసిన ఘటనను దృష్టిలో పెట్టుకుని అధికార యంత్రాంగం సరైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

చెక్‌పోస్టు కొనసాగించాలి

కొండకింద బి.కొత్తకోట పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేయడంతో ఇలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండాపోయింది. మందుబాబుల ఆగడాలు లేవు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. అయితే సిబ్బంది కొరత, విధుల నిర్వహణ, కేసుల విచారణ, ఘటనా స్థలాల పరిశీలన, సమావేశాలు, బందోబస్తులు ఇలా ఎన్నో పనులతో సిబ్బంది కొరత ఏర్పడింది. దీనికారణంగా చెక్‌పోస్టు నిర్వహణ తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ చెక్‌పోస్టును తిరిగి కొనసాగిస్తే శాంతిభద్రతలను అదుపులో ఉంచడమే కాకుండా అనుమానితుల రాకపోకలను కట్టిచేసేందుకు వీలుంటుంది. ఈ విషయమై ఉన్నతాధికారులు సరైన చర్యలు చేపట్టాల్సి ఉంది.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

నిమ్మనపల్లె : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. ఆదివారం నిమ్మనపల్లెలో పర్యటించిన ఆయన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. స్థానిక జోయెల్ గాస్పల్ మినిస్ట్రీ చర్చి ఫాదర్ జయకుమార్‌తో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం నిసార్ అహ్మద్ మాట్లాడుతూ....కూటమిప్రభుత్వం ఏర్పాటై 15నెలలు పూర్తైనా ఇప్పటివరకు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. ప్రజల తరపున ప్రధాన ప్రతిపక్షంగా వైఎస్సార్ సీపీ ప్రశ్నిస్తే...నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. పరిపాలన చేతగాక, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్..సూపర్ హిట్ అంటూ విజయోత్సవ సభ నిర్వహించి గొప్పలు చెప్పుకోవడం తప్పితే, కూటమిపాలన అట్టర్‌ఫ్లాప్ అన్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. తక్కువ సమయంలో ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే కూటమి ప్రభుత్వమేనన్నారు. వైఎస్సార్ సీపీ అందించిన సంక్షేమం, అభివృద్ధి నేటికీ ప్రజలు గుర్తుచేసుకుంటున్నారన్నారు. జగన్‌ను దూరం చేసుకుని, తప్పుచేశామని పశ్చాతాపపడుతున్నారని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారి కష్టాలను తెలుసుకోవాలన్నారు. వారికి ఏ సహాయం కావాల్సి వచ్చినా అండగా నిలుస్తూ భరోసా ఇవ్వాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నవాజ్, నాయకులు హేమంత్‌కుమార్, నాగరాజ, శ్రీనివాసులు, రెడ్డిభాస్కర్, యోగానందరెడ్డి, రవితేజ, రెడ్డిశివకృష్ణ, ఖాదర్‌బాషా, సుధాకర్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, దామోదర్, నరసింహరాజు, గ్రానైట్ మహేష్, మల్లికార్జునరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న శునకాలు



ప్రశాంత్‌నగర్‌లో గుంపులుగా ఉన్న కుక్కలు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో ఏ వీధుల్లో చూసినా కుక్కల బెడద ఎక్కువైంది. వీధుల్లో గుంపులు గుంపులుగా ఉండటంతో దారి నుంచి వెళ్లే పాదాచారులు భయపడుతున్నారు. వాహనాలపై వెళ్లేవారిపై, రహదారిలో వెళ్లే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇటీవల కుక్కల బెడద ఎక్కువైంది. మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీనియర్ సిటిజెన్స్ సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మునిగోపాలకృష్ణ

మదనపల్లె సిటీ: సీనియర్‌సిటి జెన్స్‌కు రాష్ట్ర స్థాయి సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలని ఏపీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్టీ ఉన్నత పాఠశాలలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. వయోవృద్ధులపై ఇటీవల వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు. వయోవృద్ధుల చట్టం పటిష్టంగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రైల్వేలో సీనియర్ సిటిజెన్స్‌కు ప్రత్యేక రాయితీని పునరుద్ధరించాలన్నారు. అనంతరం సీనియర్ సిటిజెన్స్ సభ్యులు గొల్లపూడి తిరుపతిరావుకు సామాజిక సేవ అవార్డు అందుకోవడంతో అతనికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వై.ఎస్.మునిరత్నం, ఉపాధ్యక్షులు జగన్‌మోహన్, కోశాధికారి ఉస్మాన్‌సాహెబ్,టీఎస్ఏ క్రిష్ణమూర్తి, కామకోటి ప్రసాదరావు, భవానీప్రసాద్, ఎన్.వి.నాయుడు,శ్రీనివాసులు, సరస్వతమ్మ,ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విరూపాక్షమ్మకు దీలు, బోనాలు



విరూపాక్ష అమ్మవారికి పూజలు



బోనాలు ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

పీలేరురూరల్ : పట్టణంలోని కావలిపల్లెలోని శ్రీ విరూపాక్షమ్మ అమ్మవారికి భక్తులు దీలు, బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం భక్తులకు దీలు, బోనాలను మంగళవాయిద్యాలు, చెక్క భజనలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పూజారి సహదేవ, ఉదయ్‌కుమార్, మహితా ఆనంద్, నరేంద్ర, సురేంద్ర పాల్గొన్నారు.

రెడ్డెమ్మతల్లీ...చల్లంగ చూడమ్మా



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తులు రెడ్డెమ్మ తల్లీ చల్లంగా చూడమ్మా అంటూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయంలో భక్తులరద్దీ నెలకొంది. అమ్మవారికి ఉదయాన్నే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తుల ఆలయమెట్లకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు. హిందువులతో పాటు ముస్లింలు ఆలయానికి తరలివచ్చి పూజలు నిర్వహించారు.

దోమల నివారణ చర్యల్లో కార్యదర్శులు విఫలం



మండల పరిషత్ కార్యాలయంలో నిల్వ ఉంచిన లిక్విడ్ క్యాన్లు

పెద్దతిప్పసముద్రం: గ్రామాల్లో ప్రబలుతున్న దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడంలో పంచాయతీ కార్యదర్శులు విఫలమయ్యారు. మండలంలో ఎటు చూసినా మురికి నీటి కాలువలు కంపు కొడుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా జనావాసాల నడుమ నీటి నిల్వల ప్రదేశాల్లో దోమలు విజృంభిస్తున్నా కనీసం స్ప్రేయింగ్ చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఉదాహరణకు దోమల లార్వా పెరగకుండా వాటిని ముందస్తుగానే నివారించేందుకు మండల స్థాయి అధికారులు ఏడాది క్రితమే బయోఫ్లెక్స్ లిక్విడ్‌ను మండల కేంద్రానికి తెప్పించారు. పంచాయతీ కార్యదర్శులు ఒక్కో లీటర్ లిక్విడ్‌ను రూ.850ల చొప్పున గ్రామ పంచాయతీ నిధుల నుంచి డ్రా చేసి తెలంగాణా రాష్ట్రంలోని లిక్విడ్ కంపనీకి జమ చేయాలి. ఒక్కో పంచాయతికి 30 లీటర్ల చొప్పున కేటాయించగా 20 లీటర్లు మాత్రమే అది కూడా కొంత మంది కార్యదర్శులు మాత్రమే లిక్విడ్ తీసుకెళ్ళినట్లు సమాచారం. గ్రామ పంచాయతీల్లో నిధులు పుష్కలంగా ఉన్నా కూడా లిక్విడ్ తీసుకెళ్ళకపోవడం చూస్తుంటే కార్యదర్శులకు ప్రజారోగ్యం పట్టలేదని స్పష్టంగా తెలుస్తోంది.

అత్యాధునిక ఫీచర్లతో ఈ-పోస్ యంత్రాలు



స్మార్ట్ ఈ-పోస్ మెషిన్లపై రేషన్‌డీలర్లకు శిక్షణ ఇస్తున్న కోఆర్డినేటర్

మదనపల్లె రూరల్ : నెట్‌వర్క్ సమస్యతో ఇబ్బంది పడుతున్న రేషన్ డీలర్లకు ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేసిన స్మార్ట్ ఈ-పోస్ యంత్రాలు ఊరట కలిగిస్తాయని జిల్లా సమన్వయకర్త బయ్యారెడ్డి అన్నారు. ఆదివారం సబ్ కలెక్టరేట్ సమావేశమందిరంలో స్మార్ట్ ఈ-పోస్ మెషిన్లపై రేషన్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రేషన్‌డీలర్ల వద్ద గతంలో ఉన్నటువంటి ఈ-పోస్ యంత్రాలు పాత టెక్నాలజీ కావడంతో వాడకంలో పలు సమస్యలు తలెత్తేవన్నారు. నెట్‌వర్క్ సిగ్నల్ లేని మారుమూల గ్రామాలు, తండాల్లో రేషన్ పంపిణీ కష్టతరంగా ఉండేదన్నారు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిగ్నల్స్‌కు అంతరాయం కలగని రీతిలో వేగంగా పనిచేసే స్మార్ట్ ఈ-పోస్ యంత్రాలను డీలర్లకు అందించిందన్నారు. సిమ్, వైఫై, హాట్‌స్పాట్, బ్లూటూత్, టచ్‌స్క్రీన్ వంటి అధునాతన సదుపాయాలతో ఆండ్రాయిడ్ సాంకేతికతో స్మార్ట్ ఈ-పోస్ యంత్రాలు పనిచేస్తాయన్నారు. వేలిముద్ర పడకపోయినా, యంత్రంలోని కెమెరా ద్వారా ఐరిష్‌ను స్కాన్ చేయవచ్చన్నారు. స్మార్ట్ రేషన్‌కార్డులు స్వైప్ చేసేందుకు వీలుగా స్మార్ట్ ఈ-పోస్ మెషిన్లు రూపొందించారని, స్మార్ట్ రేషన్‌కార్డును మెషిన్‌పై పెట్టినా వైఫై ద్వారా ఆటోమేటిక్‌గా కనెక్ట్ అవుతుందన్నారు. వీటిద్వారా డిపోల వద్ద రద్దీకి ఆస్కారం ఉండదని, పారదర్శకంగా, వేగంగా రేషన్ సరుకుల పంపిణీ చేయవచ్చన్నారు. రేషన్‌డీలర్లు నూతన స్మార్ట్ ఈ-పోస్ మెషిన్ల వాడకంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని సకాలంలో సరుకుల పంపిణీ పూర్తిచేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి బి.కొత్తకోటకు 35, ములకలచెరువు 32, పెద్దతిప్పసముద్రం 37 మంది రేషన్‌డీలర్లకు స్మార్ట్ ఈ-పోస్ మెషిన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీటీ సుబ్బయ్య, డివిజనల్ టెక్నికల్ అసిస్టెంట్ అనిల్, డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు ఖాసీమ్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

సేవే లక్ష్యంగా ముందుకు సాగుదాం



మాట్లాడుతున్న రెడ్డి గణేష్

మదనపల్లె: ఐదేళ్లుగా సేవా కార్యక్రమాలను నిర్వహించడమే లక్ష్యంగా పనిచేశామని, ఇకపైనా పేదలకు సేవ చేసేందుకు ముందుకు సాగుదామని యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కలివెట్ల రెడ్డిగణేష్ కోరారు. సంస్థ స్థాపించి ఐదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం స్థానిక అనిబిసెంట్ ప్రెస్‌క్లబ్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందించినట్లు చెప్పారు. రక్తదానం, పేదరోగులకు ఆర్థిక సహకారం, అంబులెన్సులను సమకూర్చడం లాంటి సహాయ సహకారాలను అందిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. దీనికి ప్రేరణపొందిన యువకులు సంస్థలో సభ్యులుగా చేరేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శశికుమార్, జాఫర్, భాస్కర్ నాయుడు, ఆది, మహేష్, మహదేవ, నాగ, చక్రవర్తి, మోహన్, ప్రవీణ్, రాజన్న, ఆంజి, జషు, అభి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్ వంద శాతం ఉత్తీర్ణత



పాసైన సర్టిఫికెట్లతో మిట్స్ ఎన్‌సీసీ క్యాడెట్స్

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ ఎన్‌సీసీ క్యాడెట్స్ 2024-25 విద్యా సంవత్సరానికి ఎన్‌సీసీలో బీ,సీ సర్టిఫికెట్ పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి ప్రత్యేకత చాటుకుని గర్వకారణంగా నిలిచారు. వీరి క్రమ శిక్షణకు ఈ ఫలితాలు నిదర్శనంగా నిలిచాయని చాన్స్‌లర్ డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి సంతోషం వ్యక్తం చేశారు. 45 మంది బి సర్టిఫికెట్ పరీక్షకు హాజరుకాగా 29 మంది సీ సర్టిఫికెట్ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. అంతా పాస్ కావడంతో కళాశాలలో కొత్త ఉత్సాహం సందడి నెలకొంది. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్‌వి మోనిష్, చిత్తూరు 35 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పి. లోకనాథన్ క్యాడెట్లకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్స్ మాట్లాడుతూ అందరూ ఉత్తర్ణత సాధించడం తమ జీవిత లక్ష్య సాధనలో మరో మెట్టు చేరుకున్నట్లేనని ఆనందం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఆర్మీ, పోలీస్ ఇతర రక్షణ శాఖ రంగాల్లో రాణిస్తామన్న ధీమాను వారు వ్యక్తం చేశారు.

దాదంవడ్డిపల్లెలో తాగునీటి సమస్య



మోటారు బిగించని తాగునీటి బోరు

తంబళ్లపల్లె: మండలంలోని పరసతోపు పంచాయతీ దాదంవడ్డిపల్లెలో 15 రోజులుగా తాగునీటి సమస్యతో సతమతవుతున్నట్లు గ్రామస్తులు వాపోయారు. ఇక్కడ సుమారు వంద కుటుంబాలు వ్యవసాయం, కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు మోటారు మరమ్మత్తులకు గురికావడంతో సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని సంబంధింత పంచాయతీ అధికారులకు తెలిపినా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వారం రోజుల క్రితం బోరు మోటారు వెలికితీసి రిపేరికి తీసుకెళ్లారు. తిరిగి మోటారు బిగించలేదని అధికారుల నిర్లక్షవైఖరికి ఆగ్రహం వ్యక్తం చేశారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న చింతల రామచంద్రారెడ్డి, తదితరులు

కలకడ : వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీసెల్ సెక్రటరీ కరీముల్లా కుమారుడు మహమ్మద్ అనీస్ వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆదివారం రాయచోటి టౌన్ లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.